క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

అలంపూర్: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ మహమ్మద్ చిన్న మక్బుల్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ నియోజకవర్గంలోని అలంపూర్ చౌరస్తా నుంచి ఎర్రవల్లి చౌరస్తా వరకు ఎన్‌హెచ్‌ఏ-44 రోడ్డు వెంట ఉన్న 33కేవీ ఉండవెల్లి ఫీడర్ పరిధిలో ఉన్న ఒరిగిన విద్యుత్ స్తంభాలు సరి చేసే పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫీడర్ పరిధిలోని ఉండవెల్లి, మనవపాడు, ఇటిక్యాల మండలాలకు చెందిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌లైన్ ఉండవెల్లి, మారమునగాల, జల్లాపురం, కోదండాపురం, ఇటిక్యాల, సాసనూల్, ఆర్ గార్లపాడు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, హెచ్‌టీ సర్వీస్‌లకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కరపత్రాలు విడుదల



అయిజ: ఈనెల 23వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న రైతు సదస్సు కార్యక్రమానికి కరపత్రాలను మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో బుధవారం పౌరహక్కుల సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడారు. సాగు భూముల రైతులకు పట్టాలు ఇవ్వాలని, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, డబ్ల్యూటీఓ నుంచి భారత్ బయటకు రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, రోజిత్, రాములు, సుంకన్న, శ్రీనివాసులు, మధుగౌడ్ పాల్గొన్నారు.

ఎంపీ సీటు మాదిగలకు ఇవ్వండి



మానవపాడు: నాగర్‌కర్నూల్ ఎంపీ సీటును మాదిగలకు ఇవ్వాలని ఎమ్మార్పీస్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ ఎంపీ పార్లమెంట్‌కు సంబంధించి అత్యధికంగా మాదిగలున్నారని, కాంగ్రెస్ టికెట్‌ను ఇవ్వకపోవడం వారిని అవమానించడమేనని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, శేఖర్, నాగరాజు, మద్దిలేటి, రాముడు, మాలిక్ బాషా పాల్గొన్నారు.

సంపత్‌కుమార్‌కే టికెట్ కేటాయించాలి

మానవపాడు: అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు ఎంపీ టికెట్ కేటాయించాలని బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ మండల కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ సిరాజ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీ టికెట్ సంపత్‌కుమార్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మేశ్వర్‌రెడ్డి, నర్సింహులు, మైనొద్దీన్, ప్రభాకర్, మాలిక్, దండోరా శ్రీను, తిమ్మప్ప, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసి తనిఖీ చేపడుతున్నారు. బుధవారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎన్నికల అధికారులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల్లో పెద్ద ఎత్తున నగదు తరలిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా నగదు తీసుకెళ్తేటప్పుడు వాటికి సంబంధించిన రశీదులను చూపించాల్సి ఉంటుందని తెలిపారు.

బీఎస్పీ కార్యకర్తలు ఆందోళన చెందవద్దు

ఎర్రవల్లిచౌరస్తా: పార్టీలోకి వ్యక్తులు వస్తూ పోతూ ఉంటారని దీనివల్ల బీఎస్పీ కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బీఎస్పీ నాయకుడు రాంబాబు అన్నారు. బుధవారం ఇటిక్యాల మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహనీయుల సిద్ధాంతాలకు అనుగుణంగా బీఎస్పీ పనిచేస్తుందన్నారు. పార్టీని బలోపేతం చేసే విధంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని, దీనికోసం ప్రతి కార్యకర్త పట్టుదలతో కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

ఏడాదిగా కో ఆర్డినేటర్ కరువు

- సిబ్బందితో నెట్టుకొస్తున్న వైనం
- సేవలు అందడం లేదని వాదనలు
- సిబ్బంది మధ్య సమన్వయ లోపం

గద్వాల అర్బన్: బాలలకు రక్షణ, సంరక్షణ, అండగా ఉండేందుకు బాలల పరిరక్షణ విభాగంలో బాలరక్షక్ భవన్‌ను ఏర్పాటు చేశారు. వాటికి కో ఆర్డినేటర్ కరువయ్యారు. ఏడాదిగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. కేవలం సిబ్బందితోనే సేవలు అందిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. వాటి భర్తీ కోసం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

ఏడాదిగా ఖాళీగా..

చిన్నారులకు రక్షణ, సంరక్షణతో పాటు హక్కులకు భంగం కలిగితే ప్రభుత్వ అనుబంధ సంస్థలు వారికి అండగా ఉంటూ భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బాలల పరిరక్షణ విభాగం పరిధిలో బాల రక్షక్ భవన్‌ను నెలకొల్పింది. 2017 సెప్టెంబర్‌లో జిల్లా కేంద్రంలో బాలరక్షక్ భవన్‌ను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా చిన్నారులకున్న చట్టాలపై సభలు నిర్వహించి గ్రామ, మండల స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను బలోపేతం చేయడం, చైతన్యం కలిగించడంతో పాటు బాధిత చిన్నారులకు, మహిళలకు అండగా ఉండాలి. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, చిన్నారుల పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం బాలరక్షక్ భవన్ ఉద్దేశ్యం. వాటికి ప్రధానంగా కో-ఆర్డినేటర్ పోస్టు ఏడాది నుంచి ఖాళీగా ఉంది. దీంతో కేవలం సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో సరైన సేవలు అందడం లేదనే వాదనలున్నాయి.

నియమించేదెప్పుడు?



జిల్లా కేంద్రంలోని బాలరక్షక్ భవన్

జిల్లా కేంద్రంలోని బాలరక్షక్ భవన్ పరిధిలో 7విభాగాలు ఉండగా, అందులో డీసీపీయూ, చైల్డ్ హెల్ప్ లైన్, సీడబ్ల్యూసీ, జేజేబీ, ఎస్‌జేపీయూ, డీపీఓ, ఎన్‌సీఎల్‌పీ విభాగాలుంటాయి. వారందరిని సమన్వయ పర్చేందుకు ప్రభుత్వం బాలరక్షక్ భవన్ కో-ఆర్డినేటర్ నియమాకం చేపట్టింది. బాలరక్షక్ భవన్‌లో ప్రధానంగా కో-ఆర్డినేటర్, పీఓఐసీ, పీఓఎన్ఐసీ, ఎల్‌సీపీఓ, కౌన్సిలర్, సోషల్‌వర్కర్లు, ఔట్‌రిచ్ వర్కర్లు, డాటా అనాలసిస్, అకౌంటింట్, డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉండాలి. 10మంది సిబ్బంది ఉండగా, వారందరిని సమన్వయ పర్చి సేవలు కొనసాగించేలా కో-ఆర్డినేటర్ లేరు. గతంలో బాల రక్షక్ భవన్ కో-ఆర్డినేటర్‌గా హేమలత విధులు నిర్వహించారు. గతేడాది మార్చిలో ఆమె సీడీపీఓగా బాధ్యతలు చేపట్టారు. దీంతో అప్పటి నుంచి బాలరక్షక్ భవన్ కో-ఆర్డినేటర్ పోస్టు ఖాళీగానే మిగిలిపోయింది. అప్పటి నుంచి నేటి వరకు కో ఆర్డినేటర్‌ను నియమించలేదు. బాలరక్షక్ భవన్ అడ్మినిస్ట్రేషన్ విధులు అంతా డీసీపీఓ విభాగంలోని సిబ్బందిపై పనిభారం పెరుగుతుందని పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని బాలరక్షక్ భవన్ కో-ఆర్డినేటర్‌ను నియమించాలని పలువురు కోరుతున్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, పాక్షిక అనాథలు, బిక్షాటన చేసే పిల్లలు, చదువు మానేసిన పిల్లలు, నిర్లక్ష్యానికి గురైన పిల్లలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 2017 నుంచి 2024 ప్రస్తుతం వరకు, 2064 మంది చిన్నారులను రెస్క్యూ చేసినట్లు బాలరక్షక్ భవన్ అధికారులు తెలిపారు.

బాధ్యతలు చేపట్టి 15రోజులే అవుతోంది



నేను ఇన్‌చార్జి డీడబ్ల్యూఓగా బాధ్యతలు చేపట్టి 15 రోజులే అవుతుంది. దీనిపై క్లారిటీ లేదు. పై స్థాయి బాలరక్షక్ భవన్ కో-ఆర్డినేటర్ల ని యామకం గ్రూపు-2నుంచి అర్హత సాధించి రావాలి. ఎన్నికల కోడ్ ఉంది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నియామకాలు ఉంటాయి.

– సుధారాణి, ఇన్‌చార్జి డీడబ్ల్యూఓ

సమస్యల పరిష్కారమే ఎజెండాగా పనిచేద్దాం



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గద్వాల అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పని చేద్దామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్నేహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతంలో విద్య, వైద్యం అభివృద్ధి, సంక్షేమం కోసం పాలకులను ప్రశ్నించడంతో పాటు ప్రజలను చైతన్యవంతం చేస్తూ అనేక పోరాటాలు చేశామన్నారు. రాబోయే రోజుల్లో మనోధైర్యంతో ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పోరాటాలకు నడుం బిగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులను పరిశీలించి, ఈ ప్రాంత అభివృద్ధికి సహకారం అందించే నాయకత్వానికి మద్దతు ఇద్దామన్నారు. సమావేశంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు లవన్న, పరశురాముడు, వెంకట్రాములు, ఆయా మండలాల అధ్యక్షులు ఉన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ఉండవెల్లి: మండలంలోని బస్వాపురం గ్రామంలో బుధవారం శివాలయం, ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభాలను ప్రతిష్ఠ నిర్వహించారు. గ్రామపెద్దలు, అర్చకులు ఆధ్వర్యంలో ధ్వజ స్తంభాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఊరి వాకిలిలో బొడ్రాయి, లింగమయ్యను ప్రతిష్ఠించినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

గట్టు చెరువు తూం పరిశీలన



గట్టు చెరువు తూంను పరిశీలిస్తున్న ఐబీ వర్క్ ఇన్‌స్పెక్టర్, రైతులు

గట్టు: గట్టు చెరువు తూంను ఐబీ వర్క్ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ బుధవారం రైతులతో కలిసి పరిశీలించారు. చెరువులో ఉన్న నీటిని కొందరు తూం తెరిచి అక్రమంగా చెరువు కిందకు వదులుకుంటున్నారని, రైతులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఐబీ వర్క్ఇన్‌స్పెక్టర్ చెరువు తూంను పరిశీలించారు. వృథాగా తూం ద్వారా పోతున్న నీటిని బంద్ చేయించారు. అనుమతి లేకుండా చెరువు తూంను తెరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక ముందు ఇలాంటి పనులు చేయొద్దని రైతులకు హెచ్చరించారు. అధికారి వెంట బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, రైతులు రాంబాబు, లక్ష్మన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయం దగ్గర చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. కన్నడీగులు పాదయాత్రలు మొదలుపెడుతున్న తరుణంలో వేసవితాపం తీర్చుకునేందుకు ఆలయాల ప్రాంగణంలో సేద తీరుతారని, ఈ తరుణంలో ప్రాంగణంలో దేవస్థానం వారు ఈ ఏడాది కూడా యాత్రికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఊరిలో ముఖ్య కూడళి దగ్గర కూడా స్వచ్ఛంద సంస్థల వారు చలివేంద్రాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతున్నారు

టీకాలు తప్పనిసరిగా వేయించాలి



వ్యాక్సినేషన్ పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు

అయిజ: పశువులకు రకరకాల వ్యాధులు సంక్రమిస్తుంటాయని, వాటిని నివారించేందుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా పశు సంవదర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్‌లో భాగంగా మండలంలోని ఉప్పలలో బుధవారం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపా రాణి సిబ్బందితో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకొని రికార్డులను పరిశీలించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాని త్వరగా పూర్తిచేయాలని, ప్రతి రోజు వ్యాక్సినేషన్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ గిడ్డయ్య, జూనియర్ అసిస్టెంట్ భీమయ్య, ఓ ఎస్‌లు మహబూబ్, అనిల్ పాల్గొన్నారు.

మట్టిని తొలగించాలి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ నుంచి చౌరస్తా వెళ్లే మార్గంలో ఉన్న బూడిదపాడు, భైరాపురం చౌరస్తా దగ్గర ఏర్పాటు చేసిన చతుర్ముక రుద్రుడు, నంది విగ్రహాల దగ్గర రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టిని రాళ్లను తొలగించాలని సీపీఎం నాయకులు రేపల్లె దేవదాసు కోరారు. రోడ్డుకు అడ్డంగా ఉండటం వల్ల ప్రధాన కూడళి దగ్గర వాహన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ విషయంలో దేవస్థానం అధికారులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పురపాలక పరిధిలోని 9వ వార్డు దగ్గర ఇమాంపూర్ చౌరస్తాలో ఈ వారంలో రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మూల మలుపు దగ్గర వాహనాలు వేగంగా రావడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఇమాంపూర్ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు

అపరిచితులపై నిఘా ఏదీ?

- వరుస చోరీలతో అభద్రతాభావంలో ప్రజలు
- ఆలయంలో తరచుగా సెల్‌ఫోన్ల చోరీ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాలను ఆసరాగా చేసుకుని కొంతమంది అపరిచితులు తరచుగా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నారు. అపరిచితుల కదలికలపై నిఘా కరువైంది. తరచుగా ఈ ప్రాంతానికి కొత్త వ్యక్తులు ఎవరు వస్తున్నారు, ఎందుకు వస్తున్నారో కనిపెట్టే యంత్రాంగం కరువైంది. ఫలితంగా ఆలయంలో వరుసగా భక్తుల సెల్‌ఫోన్లు పర్సులు చోరీకి గురవుతున్నాయి. ఆలయంలోనే ఈ పరిస్థితులు ఉంటే పట్టణంలో సైతం వరుస దొంగతనాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పట్టపగలే దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలకు అభద్రతాభావం నెలకొంది. గతేడాది సెప్టెంబర్ 16 తెల్లవారుజామున పట్టణంలోని ఆలయంలో క్లర్క్‌గా పని చేసే శ్రీనివాసులు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. వారి ఇంట్లో బంగారు, నగదు, వస్తువులు చోరీకి గురయ్యాయి. అదే రోజు మేయిన్ బజార్‌లో జగదీష్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ చేసేందుకు తాళం పగులగొట్టినట్టు సమాచారం. ఇదే నెలలో మార్చి 6న ఆలయ పూజారి కృష్ణమూర్తి శర్మ ఇంట్లో తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడి బంగారు, నగదు దోచుకెళ్లారు. ఆలయంలో తరుచుగా భక్తుల సెల్‌ఫోన్లు, పర్సులు చోరీ గురవుతూనే ఉన్నాయి. చెప్పుకుంటూ పోతే అనేక చోరీలతో అటు పట్టణ ప్రజలు ఇటూ యాత్రికులకు అభద్రతా బావం పెరిగింది.


కదలికలపై నిఘాలేదు

అలంపూర్ ఆలయాలను ఆసరాగా చేసుకోని ఇటీవల కొత్త వ్యక్తులు తరచుగా ఇక్కడికి వస్తూ లాడ్జీలలో తిష్టవేస్తున్నారు. వీళ్లు తరచుగా ఇక్కడికి ఎందుకు వస్తున్నారు, ఎక్కడి నుండి వస్తున్నారు ఎవరు వీళ్లు అనే అనుమానాలపై నిఘా కొరవడింది. అపరిచిత వ్యక్తులు కొందరు ఇక్కడ సాధన చేసుకునేందుకు వస్తున్నామని నమ్మబలుకుతూ ఆలయానికి వచ్చే భక్తులకు తాము భైరవ స్వాములమని చెప్పి వారి దగ్గర అందినంత మేరకు దోచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదే వ్యక్తులు పట్టణంలోని కొంత మంది ఇంటికి వెళ్లి వారికి ఇంటి స్థితిగతులను వివరిస్తూ పూజలు చేయాలని చెబుతున్నట్లు తెలుస్తోంది.

దృష్టి సారించక పోతే నష్టమే

అపరిచిత వ్యక్తుల కదలికలు, వసతీగదుల్లో తిష్ట వేసే వారి వివరాల పై నిఘా పెంచకపోతే నష్టమే అని పలువురు మేధావులు బావిస్తున్నారు. పట్టపగలు హిజ్రా వేషంలో వచ్చే వారు ఈ పనులకు పాల్పడుతున్నారా? లేక ఇటీవల అఘోరా స్వాములుగా వచ్చే వారు ఈ చోరీలకు పాల్పడుతున్నారా? లేక సాధకులుగా చెప్పుకుంటూ తరచుగా ఇక్కడ లాడ్జీల్లో మఖాం వేసి ఇక్కడ సంచరిస్తున్న వారు ఈ పనులు చేస్తున్నారా? అనే విషయాలు అంతుపట్టడం లేదు.

పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం..



ప్రతి రోజు రాత్రి సమయంలో క్రమం తప్పకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. రాత్రిపూట వచ్చే వాహనాలను కూడా పరిశీలించి వారి వివరాలు తీసుకుంటున్నాం. లాడ్జీలలో దిగే వారి ఆధార్ కార్డులు తీసుకోవాలని లాడ్జీ యజమానులకు సూచించాం. పూర్తి స్థాయిలో నిఘా పెట్టాం.

– ఏ.నాగరాజు, ఎస్ఐ అలంపూర్

సఖి కేంద్రానికి బాలిక తరలింపు

ఉండవెల్లి: మండల కేంద్రంలో బాలికకు వివాహం నిశ్చయించడంతో గ్రామస్తుల సమాచారం మేరకు బుధవారం గద్వాల సఖి కేంద్రం అధికారులు అక్కడికి చేరుకొని బాలికను సఖి కేంద్రానికి తరలించారు. కర్నూల్ జిల్లాకు చెందిన కుటుంబం బాలిక(16) తల్లితో పాటు కూలిపనులు చేస్తూ ఏడాది కాలంగా మండల కేంద్రంలో జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 24న బాలికకు వివాహం నిశ్చయించడంతో ఈ సమాచారం సఖి కేంద్రం అధికారులకు చేరింది. దీంతో వారు మండల కేంద్రానికి చేరుకొని బాలికను సఖి కేంద్రానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీముద్దీన్, జిల్లా బాలల సామాజిక కార్యకర్త పద్మ, ఐసీడీసీ సూపర్ వైజర్ ఆస్మా, చైల్డ్‌లైన్ నవీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి బుధవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లు సందర్శించిన అధికారి



ఓటర్లతో సమస్యలు తెలుసుకుంటున్న సెక్టోరియల్ ఆఫీసర్ సురేష్

ధరూరు: ఎంపీ ఎలక్షన్ల నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల పోలింగ్ స్టేషన్లను రూట్ నంబర్-2 సెక్టోరియల్ ఆఫీసర్ సురేష్ సందర్శించారు. మండలంలోని చింతరేవుల, గార్లపాడు, ఉప్పేరు, ఖమ్మంపాడు, వామన్‌పల్లి గ్రామాలను ఆయన సందర్శించి వనరబుల్ మ్యాపింగ్(ఓటు వేసేందుకు వచ్చే క్రమంలో ఎవరైనా అడ్డగిస్తున్నారా) అనే విషయంపై మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. ఓటరు జాబితాలను పరిశీలించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

పనిదినాలు సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ

గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ నర్సింగరావు కూలీలకు సూచించారు. బుధవారం గట్టు, మాచర్ల గ్రామాల్లో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాత బకాయిలు, కూలీల చెల్లింపుల్లో జాప్యం తదితర విషయాలను కూలీలు డీఆర్‌డీఓ దృష్టికి తీసుకొచ్చారు. కూలీల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని డీఆర్‌డీఓ అధికారులను ఆదేశించారు. ఇదేక్రమంలో ప్రతి గ్రామంలో ఉపాధి పనులను చేపట్టి కూలీలకు పనులను కల్పించాలన్నారు. ప్రతి కుటుంబం తప్పని సరిగా వంద రోజుల పని దినాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీఓ మహేష్, ఏపీఓ స్వామి పాల్గొన్నారు.

పోషకాలున్న ఆహారం తీసుకోవాలి



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ వెంకటేశ్వరి

శాంతినగర్: గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటేశ్వరి తెలిపారు. వడ్డేపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్షం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, వడ్డేపల్లి, శాంతినగర్ అంగన్‌వాడీ టీచర్లు శిరీష, సోమేశ్వరి, కీర్తి, నాగమణి, లక్ష్మీదేవి, శ్రీదేవి, సునీత, జయలక్ష్మి, అంగన్‌వాడీ ఆయాలు, ప్రీ స్కూల్ పిల్లల తల్లులు పాల్గొన్నారు.

నాణ్యతకు మారుపేరు భారతి సిమెంట్



మార్లబీడులో మేస్త్రీలకు బీమా పత్రాలను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

ధరూరు: నాణ్యతకు మారుపేరు భారతి సిమెంట్ అని భారతి సిమెంట్ టెక్నికల్ మేనేజర్ సునీల్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని మార్లబీడులోని సబ్ డీలర్ దుకాణం వద్ద మేస్త్రీలతో సమావేశమై మేస్త్రీకు ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్లలో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి ఆల్ట్రా ఫాస్ట్ సిమెంట్ నిర్మాణం వేగవంతంగా పూర్తవుతుందన్నారు. కాంక్రీట్ సమయంలో నిపుణులైన ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారన్నారు. యాదాద్రి, వరంగల్ జాతీయ రహదారి, బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణాలకు భారతి సిమెంట్‌నే ఉపయోగించారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ విజయ బాబు, డీలర్ రంగస్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగులకు అన్నదానం



రోగులకు అన్నదానం నిర్వహిస్తున్న రమేష్

శాంతినగర్: వడ్డేపల్లికి చెందిన దొండె రమేష్ తన పుట్టిన రోజు సందర్భంగా గద్వాల ప్రభుత్వాసుపత్రిలో అనారోగ్య సమస్యలతో వచ్చిన రోగులకు బుధవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలో చేరిన 150 మందికి అన్నదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నిరుపేదలకు అన్నదానం చేసిన రమేష్‌ను శాంతినగర్ సేవాసమితి వడ్డేపల్లి సభ్యులు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో మనీషా, దేవేందర్‌రెడ్డి, అరవింద్‌లు పాల్గొన్నారు.

నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పూజలు చేస్తున్న దాతలు

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ శివ, రామాలయం వద్ద బుధవారం నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని కనులపండువగా చేశారు. గ్రామానికి చెందిన దాతలు రంగారెడ్డి, శ్రీలత దంపతులు ముందుండి కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద మహాస్నపనం, దీక్ష, రక్ష, శాంతి, ఆవాహిత, దేవతా హోమాలు చేశారు. ఉదయం 10:45 కు వృషభలగ్న శుభపుష్కరాంశమున యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కొనసాగించారు. అనంతరం ప్రాణ ప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆలయం వద్ద దాతలు అన్నదానం చేపట్టారు. గ్రామంతో పాటుగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని నాగదేవతల ప్రథమ దర్శనం చేసుకున్నారు.

చేపల చెరువుల సందర్శన



గోవర్ధనగిరిలో చేపల చెరువును సందర్శించిన మత్స్య కళాశాల విద్యార్థులు

పెబ్బేరు/వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో మత్స్యకారులు ఏర్పాటు చేసిన చేపల చెరువులను మంగళవారం పెబ్బేరు మత్స్యకళాశాల విద్యార్థులు సందర్శించారు. ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా ఈ చెరువులను సందర్శించి చేపల చెరువుల ఏర్పాటు, చేపల పెరుగుదల తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు కళాశాల అసిస్టెంట్ డీన్ నాగలక్ష్మి తెలిపారు. ఆరోగ్యకరమైన చేపల పెరుగుదలకు శాస్త్రీయంగా తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు వివరించారు. మత్స్య సంపద పెరుగుదల కోసం చేపట్టాల్సిన చర్యలపై క్షేత్ర స్థాయి పరిశీలన ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దేవానంద్, చేపల చెరువుల నిర్వాహకులు గణేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.